క్లుప్తంగా

పరీక్షల తనిఖీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న పీజీ సెమిస్టర్ పరీక్షలను విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తనిఖీ చేశారు. వైవీయూలోని మేనేజ్‌మెంట్ బ్లాక్‌లో పరీక్షలను ఆయన పరిశీలించి, కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు.

సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ నెలలో కొత్తగా విడుదలైన వికలాంగుల పింఛను సొమ్ము కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ నగర సహాయ కార్యదర్శి కేసి. బాదుల్లా విజ్ఞప్తి చేశారు. కడప నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ సిబ్బంది లబ్ధిదారులతో వేలిముద్ర వేయించుకొని డబ్బులివ్వలేదన్నారు. స్థానిక హోచిమిన్ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో కొత్తగా వికలాంగుల పెన్షన్లు ఆలస్యంగా రావడంతో సచివాలయ అడ్మిన్లు, వెల్ఫేర్ కార్యదర్శులు చేతివాటం ప్రదర్శించారన్నారు.

రక్త గ్రూపు నిర్ధరణ పరీక్షలు



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కడప కల్చరల్: నగరంలోని సీఎస్ఐ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధరణ పరీక్షలను శుక్రవారం నిర్వహిచారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ జి.శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో టెక్నీషియన్లు విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ చేసి వారి గ్రూప్‌లను తెలియజేశారు. శివశంకర్‌రెడ్డి, సుదేవి సుహవాన, ప్రేమ సాగర్, ప్రతాప్, దేవ సహాయం, త్యాగరాజు, సుధాకర్ బాబు పాల్గొన్నారు.

24న సాహిత్య సదస్సు

కడప కల్చరల్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం పది గంటలకు సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో కడపజిల్లా కైఫియత్తులు–సామాజిక అంశాలు విషయంపై తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎం.లక్ష్మయ్య ప్రసంగిస్తారని తెలిపారు.

తాత్విక చింతనపై

బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక మానస ఇన్ సమావేశ మందిరంలో ప్రాచీన భారతీయ తాత్విక చింతనపై సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కుమారస్వామిరెడ్డి తెలిపారు.

పీబీ శ్రీనివాస్‌కు నివాళి

కడప కల్చరల్ : దక్షిణాది భాషల్లో తనదైన శైలిలో మధురగానం చేసిన విలక్షణ గాయకుడు పీబీ శ్రీనివాస్ అని వక్తలు పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం అష్టభాషా కోవిదుడు, ప్రసిద్ధ గాయకుడు ప్రతివాది భయంకర శ్రీనివాస్ 94వ జయంతిని బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, ఎస్.రమేశ్‌రావు, కొత్తపల్లి రామాంజనేయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి సాయం



సాయం అందజేస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: పేద విద్యార్థి చదువుకు ఆర్థికసాయం అందించడం అభినందనీయమని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీలేరు ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గుజ్జుల కళకు రూ.30 వేల ఆర్థికసాయం ప్రకటించారు. కలెక్టర్ చేతుల మీదుగా నగదును విద్యార్థికి శుక్రవారం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే సంఘానికే పరిమితం కావాలి

కడప కల్చరల్: ఆంధ్ర ప్రదేశ్ ఎన్జీఓ సహకార గృహ నిర్మాణ సంస్థ సభ్యులు ఒకే సంఘానికి పరిమితం కావాలని, కొందరు రెండు సంఘాల్లో సభ్యత్వం తీసుకోవడం తగదని వైఎస్సార్ జిల్లా ఎన్జీఓ సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడు ఎల్.కొండారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎన్జీఓ గృహ నిర్మాణ సంస్థ కార్యకలాపాలు సాగిస్తోందన్నారు. సొంత ఇల్లు లేకపోతే సహకార గృహ నిర్మాణ సంఘంలో సభ్యత్వం తీసుకుని లబ్ధి పొందవచ్చని తెలిపారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

కడప ఎడ్యుకేషన్: ఆయుర్వేద వైద్య ప్రాచుర్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని రిమ్స్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సీనియర్ వైద్యాధికారి డాక్టర్ సింగం మురళీబాబు అన్నారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని భగత్‌సింగ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. వాచ్‌ఎం పుల్లయ్య పాల్గొన్నారు.

జై బోలో గణపతి మహరాజ్ కీ..!



కేరళ వాయిద్యాలు



వినాయక విగ్రహాల నిమజ్జనం



ఎంజే కుంటలో అన్నదానం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు

కడప కల్చరల్: బ్యాండు మేళాలు....యువత నృత్యాలు...సినీ డూప్ కళాకారుల ప్రత్యేక ఆకర్షణ....సంప్రదాయ, గ్రామీణ నృత్యాల సందడి వెరసి నగరంలో గణపతి శోభాయాత్ర కనుల పండువగా సాగింది. వినాయక చవితి ఐదో రోజున నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. ప్రతి మండపం వద్ద అన్నదానం నిర్వహించారు. స్థానిక రాజీవ్‌మార్గ్‌లో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. భక్తులు గణపతిబొప్ప మోరియా అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఎన్జీఓ కాలనీలోని భారీ పందింట్లో వినాయకస్వామి విగ్రహాన్ని ఐదో రోజున నిమజ్జనానికి తరలించారు. ఉదయం 11 గంటల నుంచి పేదలు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. మధ్యాహ్నం గణపతిని వాహనంపై కొలువుంచి తరలించారు. అన్నదానం అనంతరం లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, యువకులు ఉత్సాహ భరితంగా పాల్గొన్నారు.

70కిపైగా వినాయకుల నిమజ్జనం

కో ఆపరేటివ్ కాలనీ, చిన్నచౌకులో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని కోలాటం, నృత్య బృందాలతో ఉత్సాహ భరితంగా నిమజ్జనానికి తరలించారు. గణపతి పాటలతో అందరినీ ఆనందపరిచారు. యువకులు, పిల్లలు, పెద్దలు ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ గణపతి పేరిట రిబ్బన్లు కట్టుకుని కాషాయ జెండాలతో గణపతి బొప్ప మోరియా అంటూ ఊరేగింపుగా సాగారు. కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, తహసీల్దారు శివరామిరెడ్డి, ఇతర అధికారులు నిమజ్జన కార్యక్రమాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ సూచనల మేరకు విగ్రహాల నియంత్రణ కేంద్ర కమిటీ సభ్యులు అడుగడుగునా నిమజ్జనం సజావుగా జరిగేందుకు తమవంతుగా తోడ్పాటు అందించారు. కడప నగరం నుంచి రెండో విడతగా 70 భారీ విగ్రహాలకు పైగా నిమజ్జనానికి తరలి వెళ్లాయి. భారీ శోభాయాత్ర నిర్వహిస్తుండడంతో చెరువు వద్దకు వెళ్లేందుకు ఆలస్యమైంది. కేవలం కడప నగరం నుంచి 50–60 విగ్రహాలను తరలించగా, దేవుని కడప, పాతకడప సమీప గ్రామాలకు చెందిన మరో 20 విగ్రహాలను తరలించారు. చెరువు వద్ద మూడు నిమజ్జన పాయింట్లను ఏర్పాటు చేసి మూడు క్రేన్లతో అక్కడకు వచ్చిన భారీ విగ్రహాలను నిమజ్జనం చేశారు.



ఎన్జీఓ కాలనీలో యువతుల కోలాటం



అన్నదానం చేస్తున్న కూండ్ల ఓబుల్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వినాయక చవితి సందర్భంగా 5వ రోజున గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా 11వ డివిజన్ ఇన్‌చార్జి భాస్కర్ ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సౌమ్యనాథ ఆలయం మాజీ చైర్మన్ సౌమిత్రి, కోలా కొండయ్య, యల్లారెడ్డి పాల్గొన్నారు. కడప నగరం చిన్నచౌక్‌లోని వీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం వద్ద కాంట్రాక్టర్లు ఓబుల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మస్తాన్‌రెడ్డి 1500 మందికి అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజా, కంతా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా పార్కులను తీర్చిదిద్దుతాం

– మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలో పార్కులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ పేర్కొన్నారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన నెహ్రూ, రాజీవ్, భగత్ సింగ్, కడప ఫుడ్‌ప్లాజా, అక్కాయపల్లి పార్కులు శుక్రవారం పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, నెహ్రూ పార్కులో నిరుపయోగంగా ఉన్న వాటిని మరోచోటికి తరలించాలని కమిషనర్ సూచించారు. కంపోస్టింగ్ పిట్ సిద్ధం చేయాలన్నారు. ఓపెన్ జిమ్ సామగ్రికి మరమ్మతులు చేయించాలన్నారు. రాజీవ్ పార్కులో పైపులైన్ల కోసం తవ్విన రోడ్లను బాగు చేయాలన్నారు. భగత్ సింగ్ పార్కులో ఏనుగుబొమ్మ, ఫౌంటేన్ చుట్టూ రెయిలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం ఉండేలా పెయింటింగ్ వేయాలన్నారు. అక్కాయపల్లె పార్కు పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ ఇన్‌చార్జి జి.శ్రీనివాసులురెడ్డి, డీఈలు రాజేష్, అబిద్ హుస్సేన్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రిమ్స్ ఆస్పత్రి సందర్శన

రిమ్స్ ఆస్పత్రిలోని కేన్సర్ కేర్, క్రిటికల్ కేర్ హాస్పిటల్ పనులను కమిషనర్ ప్రవీణ్ చంద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఐపీ విభాగంలో పేషెంట్ల వివరాలను పరిశీలించారు. ప్రతి గర్భిణికి స్కానింగ్ తీసి రిపోర్టు అందజేయాలన్నారు.



పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

అసెంబ్లీలో టీడీపీ అడ్డగోలు ప్రచారం



మాట్లాడుతున్న అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్: దోమలు కుట్టడం వల్ల చంద్రబాబుకు హాని జరుగుతుందని అసెంబ్లీలో టీడీపీ అడ్డగోలు ప్రచారం చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబును జైలులో చంపేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని లోకేష్ ఆరోపించడం దారుణమన్నారు. అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే బాలక్రిష్ణ ప్రవర్తన సక్రమంగా లేదన్నారు. సినిమాల్లో లాగా అసెంబ్లీలో మీసాలు తిప్పడం, తొడలు కొట్టడం, ఈలలు, కేకలతో, విజిల్స్ వేయడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీ గౌరవానికి భంగం కలిగేలా టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరించారన్నారు. ప్రజాస్వామ్యంపై గౌరవం ఉన్నవారెవరూ ఇలా చేయరన్నారు. చంద్రబాబుకు ఎవరితోనైనా హాని ఉందంటే అది వారి కుటుంబ సభ్యులతోనేగానీ, ప్రభుత్వంతో కాదన్నారు. స్కిల్ స్కామ్‌లో సూత్రధారి, పాత్రధారి బాబేనని, కోర్టు ఉత్తర్వుల ప్రకారమే ఆయన జైల్లో ఉన్నారన్నారు. ఇన్నాళ్లు తాను నిప్పు...ఉప్పు అని బాబు చేసిన ప్రచారమంతా ఒట్టిదేనని రుజువైందన్నారు. టీడీపీకి జనం ఆదరణ కరవైందని, అందుకే వారు పిచ్చి పట్టినట్లు ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం

కడప ఎడ్యుకేషన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలపై ప్రజలకు అవగాహన అవసరమని మను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్ ఖాన్ తెలిపారు. కడప నగర శివారులోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మను) పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు శుక్రవారం ఇందిరా నగర్‌లో ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రభుత్వం అమలు చేసే పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మీర్జా విలయత్ అలీ బేగ్, మహమ్మద్ సికిందర్ హుస్సేన్, హాకీ ముద్దీన్, షోయబ్, తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. నగరంలోని నాగరాజుపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ శిక్షణ వైద్యులతో కలిసి మారుతీనగర్‌లో ఇంటింటా తిరిగి సర్వే నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో లార్వా చూపించి వాటిలో ఎబేట్ ద్రావణాన్ని వేస్తే లార్వా చనిపోతుందన్నారు. దోమలు ఉత్పత్తి కాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సాయిప్రసన్నకుమార్, గుల్జార్ బేగంపాల్గొన్నారు.

27న వామపక్షాల నిరసన



విలేకరులతో మాట్లాడుతున్న వామపక్ష నేతలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్తు ఛార్జీల పెంపుదలను, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని నిరసిస్తూ ఈ నెల 27న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామ్మోహన్ తెలిపారు. సీపీఐ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ విద్యుత్తు చార్జీల పెంపుతో సామాన్య, మధ్య తరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ బిగించే నిర్ణయాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు కొనసాగించాలని, విద్యుత్ ప్రైవేటీకరణను విడనాడాలని సూచించారు. 27న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి యస్.వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంవీ.సుబ్బారెడ్డి, సి.సుబ్రహ్మణ్యం, ఓబయ్య, సీపీఎం నాయకులు బెల్లం మనోహర్, చంద్రారెడ్డి, డిఎం.ఓబులేష్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలపై వినతి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య

కడప కోటిరెడ్డిసర్కిల్: అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు మంజుల, లక్ష్మీదేవి, గంగావతి కోరారు. ఐసీడీఎస్ పీడీని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ మురికివాడలలో నివశించే పేద గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సేవలందిస్తున్నామని, తక్కువ గౌరవ వేతనాలతో వెట్టి చాకిరీ చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు.నిర్వహణకు సంబంధించిన బిల్లులన్నీ సకాలంలో చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. నిరంతరం నిత్యావసర సరుకుల ధరలు, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెరుగుతుండగా, వేతనాలు పెరగక జీవనం గడపడం కష్టంగా ఉందన్నారు. ఈనెల 25న విజయవాడలో ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు.

అంధ విద్యార్థికి అభినందన

కడప ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక విభాగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిలర్ ఫర్ ఎడ్యుకేషన్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్ కార్యక్రమంలో కడప ప్రభుత్వ ఆంధుల పాఠశాల విద్యార్థి శర్వానందరెడ్డి ప్రతిభ కనబరిచాడు. పులివెందులలో నిర్వహించిన సైన్స్ సెమినార్‌లో కన్సొలేషన్ బహుమతి సాధించారు. ఇందుకు కడప అధుల పాఠశాల హెచ్‌ఎం శంకరయ్య, గైడ్ టీచర్ వెపరాల ఎబినేజర్ విద్యార్థి శర్వానంద్‌రెడ్డి అభినందించారు.

కార్మికుల సమస్యలపై చర్చించాలి



కడప నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప కార్పొరేషన్: ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జి.వేణుగోపాల్, నగర ప్రధాన కార్యదర్శి యు.మద్దిలేటి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సీపీఎస్ విధానం రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి తారకరామారావు, నగర అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, వెంకటాద్రి, బాబు, పెంచలయ్య, చంద్రశేఖర్, కళ్యాణ్ పాల్గొన్నారు.

పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్ నాయకులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద పికెటింగ్ నిర్వహించారు. కార్యాలయ ప్రధాన గేటు మూసివేసి బైఠాయించారు. ఉద్యోగులు, ప్రజలు కార్యాలయ ప్రాంగణంలోకి వెళ్లకుండా కాసేపు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటేష్, మహాజన సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు చిన్నయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలనే తమ న్యాయమైన డిమాండ్ పాలకులకు పట్టడం లేదని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత తీసుకొస్తామని భాజపా ఇచ్చిన హామీ విస్మరించిందన్నారు. ఈ నెల 18వతేదీ నుంచి 22వతేదీ వరకూ పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ఊసే లేకపోవడం విచారకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు నరసింహులు, గంగరాజు, బాలయ్య, మహిళా విభాగం నాయకులు విజయరాణి, రమాదేవి, గంగమ్మ, చిన్నసుబ్బయ్య యాదవ్ పాల్గొన్నారు.

27న మహా ధర్నా

కడప ఎడ్యుకేషన్: కేజీ టు పీజీ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 27న విజయవాడలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను వేంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అసిస్టెంట్ కలెక్టర్‌కు సన్మానం



ట్రైనీ కలెక్టర్‌తోపాటు వారి తల్లిదండ్రులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్(ఐఏఎస్)ను పీఆర్‌టీయూ బృందం శుక్రవారం ఘనంగా సన్మానించింది. మౌర్య భరద్వాజ్ జన్మదినం సందర్భంగా కడపలోని అసిస్టెంట్ కలెక్టర్ బంగ్లాలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఏబీ.రామక్రిష్ణమరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మానుగుంట రవిశంకర్ ఆధ్వర్యంలో మౌర్య భరద్వాజ్, ఆయన తల్లిదండ్రులను సన్మానించారు. వారు మాట్లాడుతూ మౌర్య భరద్వాజ్ తండ్రి ఎమ్మెస్ ప్రసాద్ నర్సీపట్నంలో ప్రధానోపాధ్యాయుడు, పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా పనిచేశారన్నారు. ఆయన కుమారుడు ట్రైనీ కలెక్టర్‌గా వైఎస్సార్ జిల్లాకు రావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణప్రసాద్, చింతలరాయుడు, బ్రహ్మదేవి ప్రసాద్, చలపతిరాజు, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడడం నేరం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది ప్రభాకర్

కడప ఎడ్యుకేషన్: విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరమని న్యాయసేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాది ప్రభాకర్ అన్నారు. కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందని, అలా చేస్తే శిక్షార్హులని పేర్కొన్నారు. అనంతరం టీమ్ సభ్యులతో ర్యాగింగ్ పాల్పడితే వర్తించే చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎండీ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపల్ వీఎస్ఎస్.మూర్తి, కేఎల్ఎం ప్రిన్సిపల్ రత్నమ్మ, యాంటీ ర్యాగింగ్ కమిటీ సమన్వయకర్త దుర్గాప్రసాద్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రాధ, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిషేధం



సమావేశంలో మాట్లాడుతున్న కెతుర

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాల్య వివాహాలు ప్రభుత్వం నిషేధించిందని, వాటితో కలిగే అనర్థాలను తెలిపి నిరోధించేందుకు సహకరించాలని డిస్ట్రిక్ట్ సోషియల్ అండ్ బిహేవియర్ చేంజ్ కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ కెతుర తెలిపారు. కడప నగరంలోని అయేషా మోడల్ స్కూల్ విద్యార్థినులకు శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. ఆరోగ్యకరమైన భవిష్యత్తు, రక్తహీనతను అధిగమించేందుకు బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకురాలు రహమతున్నీసా, బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ విలువ రూ.35 లక్షలకు పెంపు

- కోర్టు కేసు ఉపసంహరించుకొని దక్కించుకున్న ఎస్ఎస్‌హెచ్‌ఎఫ్ఎఫ్ ఎగ్జిబిషన్
- కడపలోని నివాస గృహాలకు మళ్లీ డోర్ నంబర్లు
- నగరపాలక స్టాండింగ్ కమిటీ తీర్మానాలు



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప మున్సిపల్ మైదానంలో నిర్వహించే ఎగ్జిబిషన్ టెండర్ విలువను రూ.35 లక్షలకు పెంచుతూ నగరపాలక స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ సురేష్‌బాబు అధ్యక్షతన శుక్రవారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. గతంలో రూ.15 లక్షలకు వేలం పాడి టెండర్ దక్కించుకున్న ఎస్ఎస్ హ్యాండ్ లూమ్ హ్యాండీ క్రాఫ్ట్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ పెంచిన మొత్తాన్ని చెల్లించేందుకు ముందుకొచ్చింది. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ద్వారా లీగల్ ఒపీనియన్ తీసుకున్న తర్వాత ఎగ్జిబిషన్‌ను వారికే అప్పగించాలని స్టాండింగ్ కమిటీ తీర్మానించింది. ఈ సమావేశంలో కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎం.సుబ్బారెడ్డి, శిరీష, మేసా ప్రమీలరాణి, వి. హేమలత, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఎస్ఈ రత్నాల రాజు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, ఈఈలు నారాయణ స్వామి, కరిముల్లా, డీఈలు, ఆర్‌ఓలు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సభ్యులకు సన్మానం

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యుల కాలపరిమితి శుక్రవారంతో ముగిసింది. దీంతో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎం.సుబ్బారెడ్డి, శిరీష, మేసా ప్రమీలారాణి, ఎస్ఎండీ.షఫీ, వి.హేమలతలను మేయర్ సురేష్ బాబు, కమిషనర్ ప్రవీణ్ చంద్ ఘనంగా సత్కరించారు. డెంగీ జ్వరంతో బాధపడుతున్న షఫీ శుక్రవారం సమావేశానికి హాజరు కాలేదు. త్వరలోనే కొత్త సభ్యులను ఎన్నుకోనున్నారు.

తీర్మానాలివీ..

- కడప నగరపాలక సంస్థకు సంబంధించిన క్లీన్ కడప సర్వీస్ స్టేషన్ నిర్వహణ, పెట్రోల్, డీజిల్ కొనుగోలుకు రూ.50 లక్షలు, ఆపరేటర్ల వేతనాలు, మౌలిక సదుపాయాలకు మరో రూ.50 లక్షలు సాధారణ నిధుల నుంచి ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు.
- పెట్రోల్ బంకులో పనిచేయడానికి 15 మంది పంప్ ఆపరేటర్లను రూ.12 వేల వేతనంతో తీసుకొనేందుకు అనుమతి మంజూరు చేశారు.
- పారిశుద్ధ్య నిర్వహణకు ఉపయోగిస్తున్న 360 మంది కార్మికుల కాలపరిమితి పొడిగించారు.
- కడప నగరపాలక సంస్థ పరిధిలోని నివాస గృహాలకు నజరీ నక్ష డోర్ నంబర్లను పెయింటింగ్‌తో వేసేందుకు రూ.23లకు టెండర్ పిలవాలని తీర్మానించారు.